## ప్రధాని కార్యాలయం...

# రాజకీయ పంచాయతీల వేదిక

### వరికి రూ.వెయ్యి ఇవ్వాల్సిందే! ❑ సింగరేణి లాభాల్లో 25 శాతం కార్మికులకు వాటా
### స్వామినాథన్ సిఫార్సుల అమలెక్కడ? ❑ కరీంనగర్ జిల్లా 'ఏరువాక'లో చంద్రబాబు

కరీంనగర్ - న్యూస్‌టుడే

ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంఓ) రాజకీయ పంచాయతీ కార్యాలయంగా మారిందని తెదేపా అధినేత, యూఎన్‌పీఏ కన్వీనర్ నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. వరికి క్వింటాలుకు రూ.వెయ్యి మద్దతు ధరగా ఇవ్వాలని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను కోరేందుకు వెళితే, నాకు అనుమతి ఇవ్వకుండా అవమానించారన్నారు. 'పీఎం కార్యాలయం చేసిన అవమానాన్ని పక్కనపెట్టి.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఈనెల 23న ప్రధానమంత్రిని కలిసేందుకువెళ్లా. రాష్ట్రంలో వరికి మద్దతు ధరపై తెదేపా నేతృత్వంలో చేపట్టినఉద్యమాలకు లభించిన ప్రజాస్పందనను చూసి జడిసిన కాంగ్రెస్ ఎంపీలూ నేను వెళ్లిన రోజునే ప్రధానమంత్రిని కలవడానికి వచ్చారు.. పీఎంవో కార్యాలయం, నాకన్నా ముందే కాంగ్రెస్ ఎంపీలను ప్రధానమంత్రిని కలిసేలా చక్రం తిప్పింది. పీఎంవో కార్యాలయం ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడటానికి కూడా నన్ను అనుమతించలేదు. అదే కాంగ్రెస్ ఎంపీలను అనుమతించారు. పీఎంవో కార్యాలయంలో ఇంతలా దిగజారుతుందని అనుకోలేద'ంటూ తీవ్రంగా విమర్శించారు. కరీంనగర్ జిల్లాలో సోమవారం ఆయన 'ఏరువాక' పేరుతో మేడారం, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో రోడ్ షోలను నిర్వహించారు. వరికి రూ.వెయ్యి మద్దతుధరను ప్రకటించాలన్న డిమాండ్‌ను అస్త్రంగా చేసుకొని ఆయన ప్రసంగించారు.

**అడగడుగునా వివక్ష:** వరి రైతుపై కేంద్రం అడుగడుగునా వివక్ష చూపుతోందని చంద్రబాబు విమర్శించారు. 'గోధుమకు క్వింటాలుకు ఒకే సారి రూ.250 పెంచారు. వరికి మాత్రం నామమాత్రంగా పెంచారు. గోధుమకన్నా వరి ఉత్పత్తి వ్యయం అధికం. దీన్ని పరిగణనలోకి తీసుకొని మద్దతు ధరను నిర్ణయించాల్సిన కేంద్రం అడ్డగోలుగా వ్యవరిస్తోంద'ంటూ ధ్వజమెత్తారు. 'మేం అధికారంలో ఉన్నపుడు పత్తికి క్వింటాలుకు రూ.2,500 నుంచి నుంచి రూ.3000 వరకు గిట్టుబాటయింది. ప్రస్తుతం క్వింటాలు పత్తికి రూ.2050ను మద్దతు ధరగా ప్రకటించారు. అకాల వర్షాల వల్ల పత్తిదిగుబడులు తగ్గాయి. నాణ్యతా తగ్గింది. మద్దతు ధరను కనీసం రూ.3000లు ఇస్తేనే రైతుకు గిట్టుబాటవుతుంది. ప్రస్తుతం గిట్టుబాటు ధరలు దక్కకపోవడం వల్ల.. పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నార'ని ఆవేదనవ్యక్తం చేశారు. చెరకు, మొక్కజొన్న, వేరుసెనగ రైతులదీ ఇదే పరిస్థితంటూ వివరించారు. వరి, చెరకు మొక్కజొన్న, వేరుసెనగ రైతులకు ఆమోదయోగ్యమైన మద్దతు ధరలను ప్రకటించేంత వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

**స్వామినాథన్ సిఫార్సులు ఎక్కడ:** 'రైతు ఆత్మహత్యలను నివారించడానికి కేంద్రం నియమించిన స్వామినాథన్ కమిషన్ తొమ్మిది సిఫార్సులు చేసింది. అందులో మద్దతు ధర ఒకటి. స్వామినాథన్ సిఫార్సులు అమలుచేస్తామని ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటిదాకా అమలుచేయలేదు. వాటిని తక్షణమే అమలు చేయాలి' అని చంద్రబాబు డిమాండ్ చేశారు. 'మేం అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ అనంతపురం జిల్లాకు వచ్చి.. ఆత్మహత్య చేసుకొన్న రైతు కుటుంబాలపై కపట ప్రేమ చూపారు. మా హయాంలో తక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొంటే.. ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకొన్నట్లు చూపి మమ్మల్ని బదనాం చేశారు. వైఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో 4,500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. అప్పుడు రైతులపై చూపిన



'ఏరువాక'లో ఎద్దులబండిపై వస్తున్న చంద్రబాబు



మంథనిలో చంద్రబాబు రోడ్ షో.. హాజరైన జనం

ప్రేమ.. ఇప్పుడా ఏమైంద'ంటూ ఎత్తిపొడిచారు.

**వైఎస్.. సేద్యం దండగా:** ప్రతిపక్షంలో ఉన్నపుడు రైతులపై లేని ప్రేమను ఒలకబోసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారం చేపట్టగానే సేద్యం దండగని రైతులను అపహాస్యం చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. వరి రైతులు మద్దతుధర దక్కక అల్లాడుతుంటే.. తక్షణమే ప్రధానమంత్రిని కలిసి అన్నదాతల సమస్యలను పరిష్కరించాల్సిన సీఎం వైఎస్ రోమ్ నగరం తగలిబడితేపోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. 'రాష్ట్రంలో రూ.కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన జలయజ్ఞం వల్ల రైతులకు ఇప్పటి దాకా ఒరిగిందేమీ లేదు. కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ నేతలు రూ.కోట్లకు కోట్లు కొల్లగొట్టారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో రాత్రికి రాత్రే రూ.400 కోట్లు దోచుకున్నారు. ఎల్లింపల్లి ఎత్తిపోతల పథకంలో పగిలిపోయిన పైపులతో పనులను నాసిరకంగా చేస్తున్నారు. ఈ పైపుల్లో నీళ్లమాటేమో గానీ.. రైతుల కన్నీళ్లు వస్తాయ'ని అన్నారు.

**సింగరేణి లాభాల్లో కార్మికులకు 25 శాతం:** మూతపడటానికి సిద్ధంగా ఉన్న సింగరేణి కాలరీస్‌ను లాభాల్లోకి తెచ్చిన ఘనత తెదేపాదేనని చంద్రబాబు పేర్కొన్నారు. 'సింగరేణిలో వచ్చిన లాభాల్లో 10 శాతాన్ని కార్మికులకు పంపిణీ చేశాం. వైఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే లాభాల పంచడంలోనే కాదు.. బోనస్ ఇవ్వడంలోనూ కోతేసింద'ని విమర్శించారు. 'తెదేపా అధికారంలోకి వస్తే సింగరేణి లాభాల్లో 25 శాతం వాటాను కార్మికులకు అందిస్తాం. సింగరేణి కార్మికుల వైద్య ఖర్చులను కూడా సంస్థే భరించేలా చర్యలు చేపడతాం. కార్మికులందరికీ ఇళ్లు కట్టిస్తా'మని హామీ ఇచ్చారు.

**వరద బాధితులను ఆదుకోవాలి:** నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వరదబారిన పడిన వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. మృతిచెందిన వారికి రూ.ఐదు లక్షల పరిహారం అందించాలని కోరారు.